# మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 186 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | శనివారం, 06 జూన్ 2026 | పేజీలు : 4




## తడిసిన ధాన్యాన్నీ కొంటం..

- రైతులు ఆందోళన చెందవద్దు
- అన్నదాతలకు భరోసా ఇస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

3




# రాజాసింగ్ క్షమాపణ చెప్పాలి

- జనగామలో ముస్లింల నిరసన



**జనగామ, మన చౌరాస్తా:** గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా జనగామలో ముస్లిం డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. జుమా నమాజ్ అనంతరం ఏక్‌మినార్ మసీదు నుంచి లక్ష్మీబాయి కుంట గేట్ వరకు జరిగిన ఈ కార్యక్రమంలో వందలాది మంది ముస్లింలు పాల్గొన్నారు. ముస్లిం డెవలప్‌మెంట్ కమిటీ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ జమాల్ షరీఫ్ అడ్వకేట్ నాయకత్వంలో నిర్వహించిన నిరసనలో పాల్గొన్న వారు "అరెస్ట్ రాజా సింగ్" అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఎమ్మెల్యే తన వ్యాఖ్యలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మహమ్మద్ జమాల్ షరీఫ్ మాట్లాడుతూ, రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన గౌరవం కల్పించిందని, ప్రజాప్రతినిధులు సామాజిక విద్వేషాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. రాజా సింగ్ క్షమాపణ చెప్పడంతో పాటు పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం నిరసనకారులు జనగామ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ ఆరిఫ్, మహమ్మద్ ఇక్బాల్, మహమ్మద్ నాహిద్, మహమ్మద్ ఇస్మాయిల్, మహమ్మద్ అఫ్జల్, మహమ్మద్ రహీం, మహమ్మద్ యాకూబ్, మహమ్మద్ సల్మాన్, మహమ్మద్ రఫీక్ తదితరులు పాల్గొన్నారు.



# 'ఇకో బ్రిక్స్' అదుర్స్..

- గౌతమ్ మోడల్ స్కూల్‌లో ఘనంగా పర్యావరణ దినోత్సవం



**జనగామ, మన చౌరాస్తా :** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జనగామలోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ మోతె సురేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ ఎం.డి. అహ్మద్ పాషా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వివేకానంద సేవా సమితి ప్రతినిధులు దొంతుల శేఖర్, రవికుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు వ్యర్థ ప్లాస్టిక్‌తో తయారు చేసిన 'ఇకోబ్రిక్స్'ను ప్రదర్శించి ప్లాస్టిక్ వ్యర్థాల పునర్వినియోగంపై అవగాహన కల్పించారు. వారి ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాట్లాడిన ముఖ్య అతిథులు పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, చెట్లు నాటడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా భవిష్యత్ తరాలకు మెరుగైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. పాఠశాల డైరెక్టర్ మోతె సురేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో చిన్నప్పటి నుంచే పర్యావరణ స్పృహ పెంపొందించడం తమ లక్ష్యమన్నారు. బాధ్యతగల పౌరులుగా ఎదిగి ప్రకృతిని కాపాడాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో భాగంగా వివేకానంద సేవా సమితి తరఫున విద్యార్థులు, ఉపాధ్యాయులకు జ్యూట్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా:** భీమదేవరపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోలు లావణ్యకు రూ.15 వేల, పిట్టల శిరీషకు రూ.27 వేల, కొదురుపాక పోచయ్యకు రూ.25 వేల, మాచర్ల రజనీకాంత్‌కు రూ.60 వేల, జన్నారపు కుమారస్వామికి రూ.20 వేల విలువైన చెక్కులను అందజేశారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని నాయకులు తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవతోనే లబ్ధిదారులకు ఈ ఆర్థిక సహాయం అందిందని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కేతిరి లక్ష్మారెడ్డి, మాజీ జెడ్పీటీసీ బొజ్జపురి అశోక్, మాజీ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చితంపల్లి ఐలయ్య, మాజీ ఉపసర్పంచ్ కొలుగూరి రాజు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మారుపాటి గురువారెడ్డి, డబ్బా శంకర్, ఆదరి రవీందర్, చాగంటి వెంకటేశ్వర్లు, పచ్చునూరి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.





# వరికొయ్యలను కాల్చొద్దు..

- భూమిలో కలిపి సేంద్రియ ఎరువుగా వాడాలి
- బీసీఐ అసిస్టెంట్ పీయూ మేనేజర్ మల్లేష్

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా:** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమదేవరపల్లి మండలం రత్నగిరి గ్రామంలో నవ క్రాంతి ఎఫ్‌పీసీఎల్, బీసీఐ ప్రాజెక్టు ఆధ్వర్యంలో రైతులకు పర్యావరణ పరిరక్షణ, సుస్థిర వ్యవసాయ పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీఐ అసిస్టెంట్ పీయూ మేనేజర్ మల్లేష్ మాట్లాడుతూ పంట అవశేషాలను కాల్చడం వల్ల నేలలోని సేంద్రియ పదార్థాలు, సూక్ష్మజీవులు నశించి భూసారం తగ్గిపోతుందని తెలిపారు. రైతులు వరికొయ్యలను కాల్చకుండా భూమిలో కలిపి సేంద్రియ ఎరువులుగా వినియోగించుకోవాలని సూచించారు. నవధాన్య పచ్చి ఎరువులు, పశువుల ఎరువు, చెరువు మట్టి వంటి సహజ వనరులను వినియోగించడం ద్వారా నేల ఆరోగ్యం మెరుగుపడి పంట దిగుబడులు పెరుగుతాయని పేర్కొన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించే సహజసిద్ధమైన వ్యవసాయ పద్ధతులను రైతులు అవలంబించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న రైతులు పర్యావరణహిత వ్యవసాయ విధానాలపై అవగాహన పొందడంతో పాటు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. గ్రామ సర్పంచ్ వంగ తిరుమల సురేష్ మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడే ఇలాంటి అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, మహిళలు పాల్గొన్నారు.






# యూఆర్ఎస్‌లో నాన్‌టీచింగ్ పోస్టులు

– ఈ నెల 9వరకు దరఖాస్తుల స్వీకరణ

**జనగామ, మన చౌరాస్తా:** జిల్లాలోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ (యూఆర్ఎస్)లో 2026-27 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న నాన్‌టీచింగ్ పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్, విద్యాశాఖాధికారి సందీప్ కుమార్ ఝా తెలిపారు. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఖాళీల్లో అకౌంటెంట్ (1), అసిస్టెంట్ కుక్ (1), ప్యూన్/అటెండర్ (1) పోస్టులు ఉన్నాయి. అకౌంటెంట్ పోస్టుకు కామర్స్‌లో డిగ్రీతో పాటు ట్యాలీ సాఫ్ట్‌వేర్ పరిజ్ఞానం ఉండాలి. ఈ పోస్టుకు నెలకు రూ.14,300 వేతనం అందజేస్తారు. అసిస్టెంట్ కుక్, ప్యూన్/అటెండర్ పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణత అర్హతగా నిర్ణయించారు. ఈ రెండు పోస్టులకు నెలకు రూ.9,750 వేతనం చెల్లించనున్నారు. అసిస్టెంట్ కుక్ పోస్టుకు వంట నైపుణ్యాలను నిర్ధారించేందుకు డెమోన్స్ట్రేషన్ నిర్వహించనున్నారు. అభ్యర్థుల ఎంపిక విద్యార్హతలు, అనుభవం, అవసరమైతే ఇంటర్వ్యూ లేదా డెమోన్స్ట్రేషన్ ఆధారంగా చేపట్టనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు విద్యార్హతలు, వయస్సు, అనుభవ ధ్రువపత్రాలు తదితర పత్రాల జిరాక్స్ ప్రతులతో కూడిన దరఖాస్తులను ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్, జనగామలో సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలకు స్పెషల్ ఆఫీసర్‌ను 9849628441 నంబర్‌లో సంప్రదించాలని అధికారులు తెలిపారు.



ఖిలాషాపురంలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ

# తడిసిన ధాన్యాన్నీ కొంటాం..

- రైతులు ఆందోళన చెందవద్దు
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ
- అదనపు లారీలు, ట్రాక్టర్లు సమకూర్చుకోవాలని అధికారులకు ఆదేశం



**జనగామ, మన చౌరాస్తా :** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సేకరణ, రవాణా ప్రక్రియలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ అధికారులను ఆదేశించారు. రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోళ్లు వేగవంతం చేయాలని సూచించారు. శుక్రవారం రఘునాథపల్లి మండలంలోని అశ్వరావుపల్లి, వెల్ది, ఖిలాషాపూర్, మండలగూడెం, నర్మెట్ట మండలంలోని మచ్చుపాడ్, నర్మెట్ట, చిల్పూర్ మండలంలోని చిల్పూర్, నష్కల్ గ్రామాల్లోని ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు సేకరించిన ధాన్యం, మిల్లులకు తరలించిన నిల్వలు, ఇంకా కొనుగోలు చేయాల్సిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అధికారులు అందుబాటులో ఉండి ప్రక్రియను నిశితంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. రైతులతో మాట్లాడిన కలెక్టర్, తూకాలు, కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. రైతులు ధాన్యం తీసుకొచ్చిన వెంటనే నాణ్యతా పరీక్షలు పూర్తి చేసి తూకం వేయాలని కేంద్ర నిర్వాహకులకు సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేందుకు అదనపు లారీలు, ట్రాక్టర్లు సమకూర్చుకోవాలని, హమాలీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిల్లుల వద్ద అన్‌లోడింగ్ ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని సూచించారు. అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని కలెక్టర్ భరోసా ఇచ్చారు. ప్రైవేట్ వ్యాపారులకు అమ్మకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు, గన్నీ సంచులు తగినంతగా అందుబాటులో ఉంచాలని, ధాన్యం తూకం తప్పనిసరిగా 41 కిలోలకే వేయాలని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం రఘునాథపల్లి మండలంలోని కోమల్ల టోల్‌ప్లాజా వద్ద ఆకస్మిక తనిఖీ నిర్వహించి, అక్కడ నిలిపి ఉంచిన లారీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో ఆర్డీఓ గోపీరాం, తహసీల్దార్లు రాజేష్, రామానుజాచారి, విజయ్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.











# అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

- ముల్కనూరు ఆలయంలో ప్రత్యేక పూజలు



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరు గ్రామంలోని శ్రీ విశ్వేశ్వర సహిత అయ్యప్ప స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడగా, ప్రత్యేక పూజలు, హోమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో భక్తిమయ వాతావరణం నెలకొంది. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మహాగణపతి పూజ, పుణ్యాహవాచనం, కలశ స్థాపన, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, అష్టోత్తర శతనామ పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వామికి విశేష అలంకరణ చేసి ప్రత్యేక హారతులు సమర్పించారు. భక్తులు "స్వామియే శరణం అయ్యప్ప" నామస్మరణలతో ఆలయ ప్రాంగణాన్ని మార్మోగించారు. విశ్వేశ్వర స్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రుద్రపారాయణం నిర్వహించగా, అయ్యప్ప స్వామి సన్నిధిలో భజనలు, హరినామ సంకీర్తనలు నిర్వహించారు. వేద పండితులు వేదమంత్రాల నడుమ నిర్వహించిన పూజా కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించి భక్తులకు మహాప్రసాదం పంపిణీ చేశారు. సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఆలయ కమిటీ, అయ్యప్ప సేవా సమితి సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు కృషి చేశారు. ఈ వేడుకల్లో ప్రజాప్రతినిధులు, భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







## ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు
# ముల్కనూరు స్టూడెంట్స్ ఎంపిక




**భీమదేవరపల్లి, మన చౌరాస్తా:** ముల్కనూర్ ఆదర్శ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ప్రతిష్ఠాత్మక నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)కు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మజీబుర్ రెహమాన్ తెలిపారు. ఎంపికైన విద్యార్థుల్లో సి.హెచ్. సంకీర్తన, రోషన్ బేగం, ఎస్. సస్యశ్రీ, ఎం. రామ్ చరణ్ ఉన్నారు. విద్యార్థులు సాధించిన ఈ విజయంపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మజీబుర్ రెహమాన్ మాట్లాడుతూ విద్యార్థులు ఇదే పట్టుదలతో విద్యాభ్యాసం కొనసాగించి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించి శుభాకాంక్షలు తెలిపింది.

మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక
శనివారం, 06 జూన్ 2026
Mana Chourasta



# ఓటీటీలో రచ్చ చేస్తున్న
# మృత్యుంజయ్




ఓటీటీల్లో సినిమాలు చూసే వారి సంఖ్య పెరిగింది. అటు థియేటర్లలో బ్లాక్ బస్టర్ హిట్స్ అయిన చిత్రాలు నెల రోజుల్లోనే డిజిటల్ ప్లాట్ ఫామ్ పైకి రావడం.. అలాగే ఇటు కొత్త కొత్త కంటెంట్ వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ అవుతుండడంతో ఓటీటీలకు మరింత ఆదరణ లభిస్తుంది. ప్రస్తుతం ఒక మూవీ నెట్టింట దుమ్మురేపుతుంది. అందులో ప్రతీ సీన్ మిమ్మల్ని కట్టిపడేస్తుంది. అలాగే క్షణ క్షణం ఉత్కంఠతతో సాగుతుంది. వీకెండ్ వచ్చేసింది. ఈ వారాంతంలో ఓటీటీలో ఏ సినిమా చూడాలా అని ప్రేక్షకులు గందరగోళానికి గురవుతారు. శనివారం, ఆదివారం వచ్చిందంటే చాలు మంచి సినిమా చూస్తూ ఎంజాయ్ చేయాలని అనుకుంటారు. కొంతమంది మాత్రం ఎక్కువగా సస్పెన్స్ చిత్రాలు చూసేందుకు ఇష్టపడుతుంటారు. అందుకే ఇప్పుడు మీ కోసం ఒక మంచి సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్ మూవీని తీసుకువచ్చాం. ఈ మూవీ మిమ్మల్ని చివరి క్షణం వరకు కట్టిపడేస్తుంది. ఇంతకీ ఆ సినిమా పేరేంటో తెలుసుకుందామా. ఈ సినిమా హీరో ఒక వార్తాపత్రికలో ప్రకటనల నిపుణుడిగా పనిచేస్తాడు. క్రైమ్ రిపోర్టర్ అవ్వాలన్నది అతని కల. అతను చనిపోయిన వారి ఇళ్లకు వెళ్లి, వారి కుటుంబాల నుండి 'సంస్మరణ' ప్రకటనలను కొనుగోలు చేస్తూ పనిచేస్తాడు. అందుకోసం అతను మృతుల ఇళ్లకు వెళ్లి సమాచారాన్ని సేకరిస్తాడు. అతను వెళ్లిన ఇంట్లో ఇద్దరి మరణాలు ఒకే విధంగా జరిగాయని తెలుసుకుని దిగ్భ్రాంతికి గురవుతాడు. ఏదో తప్పు జరుగుతోందని భావించి, అతను దర్యాప్తు మొదలుపెడతాడు. అతడు నిజం కనుక్కున్న తర్వాతే అసలు కథ మొదలవుతుంది. ఊహించని ట్విస్టులతో సాగుతుంది. ఇప్పుడు మనం మాట్లాడుకుంటున్న మూవీ పేరు మృత్యుంజయ్. ఇది ఇప్పుడు ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫామ్ నెట్ ఫ్లిక్స్ లోకి అందుబాటులోకి వచ్చింది. ఇందులో శ్రీవిష్ణు, రెబెకా హీరోహీరోయిన్లుగా నటించారు. క్రైమ్ థ్రిల్లర్ జానర్‌లో రూపొందిన ఈ చిత్రం, చివరికి ఏం జరుగుతుందోనన్న ఉత్సుకతను రేకెత్తిస్తుంది. సన్నివేశం నుండి సన్నివేశానికి సాగే కథనం, మిమ్మల్ని సీటు అంచున కూర్చోబెట్టే విధంగా ఉంటుంది. చివరిలో వచ్చే మలుపు ప్రేక్షకులను ఆసక్తిగా చూసేలా చేస్తుంది. అనవసరమైన సన్నివేశాలతో సమయం వృధా చేయకుండా నేరుగా కథలోకి వెళ్లడమే ఈ సినిమా బలం. హంతకుడు హీరోని చంపడానికి వెంబడిస్తాడు. అతని నుండి హీరో తప్పించుకోవడం, హత్యకు గల కారణాలు కథనం వేగాన్ని పెంచుతాయి. ఊహించని సీన్స్, ప్రతి క్షణం ఉత్కంఠ.. ఆలోచించని మలుపులు ఆద్యంతం ఈ సినిమాపై ఆసక్తిని రేకెత్తిస్తుంటాయి. ఈ వారాంతంలో మలుపులతో నిండిన థ్రిల్లర్ చూడాలనుకునే వారికి 'మృత్యుంజయ్' ఒక మంచి ఎంపిక అని చెప్పొచ్చు. కేవలం తెలుగులోనే కాకుండా తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషలలోనూ ఈ చిత్రం అందుబాటులో ఉంది. మరి ఇంకెందుకు ఆలస్యం ఈ సినిమాను ఈ వీకెండ్ ఇంట్లోనే చూసి ఎంజాయ్ చేయండి.

Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**